కథ

# ప్రతీకారం

— భూసా అప్పలరెడ్డి



> ఆమె జీవితం మొగ్గదశలోనే బొగ్గయింది. చేసిన తప్పును దిద్దుకోవడానికి అతడు చేసిన ప్రయత్నం నిరర్థకమైంది.

'విచారిస్తూ కూర్చుంటే లాభం లేదు రాఘవయ్యా! కొంచెం ముందూ వెనుకా తప్ప అందరమూ పోవాల్సిన వాళ్లమే. పొద్దుగుంకే సమయం కావస్తుంది. లే... లేచి ఏర్పాట్లు చూడు' నా భుజం మీద అనునయంగా తడుతూ చెప్పాడు పరశురామయ్య.

తలెత్తి చూశాను. నావైపే జాలిగా చూస్తున్నాడతను. అతన్ని వాటేసుకొని భోరుమని ఏడవాలనిపించింది. అందుకు నా వయస్సు అడ్డం వచ్చింది. 'అవును. ముందూ వెనుకా తప్ప రేపో మాపో అందరం పోవాల్సిన వాళ్లమే. వరండాలో వున్న నా భార్య శవంవైపు చూశాను. ప్రశాంతంగా నిదురపోతున్నట్టు కనిపిస్తుంది. మృతఛాయలేమీ ఆమె ముఖంలో కనిపించడం లేదు. ఇరుగు పొరుగు ఆడవాళ్లు దూరపు దగ్గర బంధువులూ ఆమె శవంచుట్టూ కూర్చొని ఆమె మంచితనం గురించి పరోపకార గుణం గురించి కథలుగా చెప్పుకుంటున్నారు. అయినా ఆ దృశ్యంలో ఏదో లోటు కొట్టొచ్చినట్లు కనిపిస్తుంది.

అవును. లోటే! నా భార్య శవం మీదపడి ఎవ్వరూ శోకాలు తియ్యడం లేదు. కనీసం కన్నీరు కార్చేవాళ్లు కూడా కనిపించడం లేదు. అది లోటు కాక మరేమిటి? ఏడుపుల్లేని శవం ఎక్కడైనా కనిపిస్తుందా? కానీ ఆ లోటు పూడ్చలేనిదని నాకు తెలుసు. 'మమ్మల్ని అన్యాయం చేసి వెళ్లిపోయావా తల్లీ' ఆ భగవంతుడు నిన్నొదిలేసి మమ్మల్నయినా తీసుకుపోయాడు కాదు అని ఏడవటానికి ఆమె తల్లిదండ్రులూ బ్రతికి లేరు. నా తల్లిదండ్రులూ బ్రతికి లేరు.

'ఏమాటకామాటే చెప్పుకోవాలి. మహాదొడ్డ ఇల్లాలమ్మా! ఆపదలో వున్నామని తెలిస్తే చాలు పరిగెత్తుకొచ్చి ఆదుకునేది. కానీ ఏం లాభం' ఆ మాయదారి దేముడు ఆయమ్మ కడుపునో కాయ పడేసాడు కాదు.

అంత విషాదంలోనూ నవ్వొచ్చింది నాకు. మాకు సంతానం లేకపోవడానికి ఆమె అనుకున్నట్టు ఆ మాయదారి దేముడు కారణం కాదని వీరికేం తెలుసు? వీరికే కాదు. నాకూ నా భార్యకూ ఆ భగవంతుడికీ తప్ప ఇంకెవరికీ తెలీదు.

నా మెదడు మూడు దశాబ్దాల క్రితం నేను రఘుగా చెలామణీ అయ్యేటప్పటి జ్ఞాపకాల పొరలని వెలికి తియ్యసాగింది.

★ ★ ★

విశాఖపట్నం సెంట్రల్ జైల్లో శిక్ష అనుభవించి ఆరోజే విడుదల అయ్యాను. జైలునుంచి ద్వారకా బస్ కాంప్లెక్స్ పది నిమిషాల నడక దూరంలో వుంది. బస్టాండ్‌లో మావూరిమీదినుంచి పోయే బస్సెక్కి కూర్చొని కిటికీ దగ్గర సీట్లో కూర్చున్నాను. బస్సు పరుగెడుతోంది. నా ఆలోచనలతో బాటే.

నేను మారేను. అవును పూర్తిగా మారిపోయాను. నేననుభవించిన అయిదు సంవత్సరాల జైలుశిక్ష నాలోని దానవుడ్ని చంపేసి మానవుడ్ని బతికించింది. నన్నో మనిషిని చేసింది. శిక్ష అనేది కొంతమంది దుర్మార్గుల్ని సన్మార్గుల్ని చేస్తే మరికొంతమందిని మరింత దుర్మార్గుల్ని చేస్తుంది. అయితే అది నన్ను సన్మార్గుడ్ని చేసింది.

సరిగ్గా అయిదు సంవత్సరాల క్రితం నా ఇరవయ్యో ఏట ఓ మైనర్ బాలికని మానభంగం చేసి జైల్లో పడ్డాను. ఆ అమ్మాయిది మా ఇంటిపక్క ఇల్లే. పేరు కాంతి. ఏడో ఎనిమిదో తరగతులు చదువుతుండేది అప్పుడు.

నా అరచేతిలో విద్యారేఖ భూతద్దం వేసి వెదికినా కనిపించేది కాదు. అప్పటికి పదో క్లాసు వరుసగా పది ఏళ్లు తప్పి మరిక నావల్ల కాదని మానేసి వూరుమీద పడి బలాదూర్‌గా తిరుగుతుండేవాడ్ని. తల్లిదండ్రులకి ఒక్కడ్నే కొడుకుని కావడం చేత అమ్మా బాబూ నా గురించి పెద్దగా పట్టించుకునేవారు కాదు.

చెడు తలపులున్నవాడ్ని చెడ్డ వార్తలే ఎక్కువగా ఆకర్షిస్తాయనుకుంటాను. దిన పత్రికల్లో పడే, స్త్రీలమీద జరిగే అత్యాచారాల్లాంటి వార్తల్ని చాలా మక్కువగా చదివేవాడ్ని. దానికి తోడు ఒకటి రెండు సచిత్ర వారపత్రికలు 'మానభంగం'ల్లాంటి సంఘటనల్ని సీరియలైజ్ చేసి వారం వారం ఉత్కంఠ భరితంగా ప్రచురించేవి తమ పత్రికల్లో. అవి మరీ ఆకర్షణీయంగా కనిపించేవి నాకు. అలాంటి పత్రికలు రాగానే కొనేసి ఆబగా చదివేసేవాడ్ని.

రానురాను నాలోకూడా ఎవరినైనా బలవంతంగా అనుభవించాలన్న కాంక్ష బయల్దేరింది. అయితే ఎవర్ని? అప్పుడు పడింది నా దృష్టి మా పక్కింటి కాంతిమీద.

కాంతిని ట్రాప్ చెయ్యడానికి పథకం పన్నసాగాను.

ఒకనాటి సాయంకాలం కాంతి చదువుకునే స్కూలుముందు బీటేశాను. స్కూలు వదలగానే బయటకొచ్చిన కాంతిని ఇంటి దగ్గర దిగబెడతానని ఒప్పించి సైకిల్‌మీదెక్కించుకొని వూరు చివరి తోటలోకి తీసుకెళ్లి బలవంతంగా చెరిచాను. ఏడుస్తున్న కాంతిని ఏమీ కాదని ఓదార్చి, ఈ సంగతి ఇంట్లో చెబితే తన అమ్మా నాన్న కాంతిని చంపేస్తారని బెదిరించి ఇంట్లో చెప్పొద్దని భయపెట్టి మామూలుగా ఇంటికి తీసుకొచ్చేశాను.

అయితే కాంతి జరిగింది దాచలేదు. నేను చేసిన అత్యాచారం గురించి తన తల్లిదండ్రులకి చెప్పేసింది. వాళ్లు పోలీస్ రిపోర్టు ఇచ్చారు. ఫలితంగా నా నేరం రుజువు కావడంతో అయిదు సంవత్సరాల జైలుశిక్ష పడింది.

బస్సు ఆగడంతో ఆలోచనల్లోంచి బయటపడి కిటికీలోంచి చూశాను. మావూరొచ్చేసిందప్పుడే. బస్సు దిగి మా వూరుకున్న ఒకే ఒక మెయిన్ రోడ్డుమీద నడవసాగాను. మా వూరేమీ మారలేదు. అయిదు సంవత్సరాలు గడిచినా మావూరి ఆకారంలో ఇసుమంతైనా మార్పు రాలేదు. అదీ హైస్కూలు. నేను చదివింది అక్కడే. కాంతి కూడా అక్కడే చదివేది. స్కూలు పక్కనే రేపో మాపో చావటానికి సిద్ధంగా వున్న వృద్ధమూర్తిలా అదే పెంకుటింట్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం. పక్కనే టూరింగ్ హాలు. మూసేసినట్టుంది. బోసిగా కనిపిస్తుంది. వూరిమధ్యన అదే మంచినీటి చెరువు. వర్షాలు పడకపోవడం వలన ఎండిపోయి కనిపిస్తుంది. అయిదు సంవత్సరాల క్రితమెలా వుందో ఇప్పుడూ అలాగే వుందిప్పుడు.

నన్ను గుర్తుపట్టిన వాళ్లల్లో కొంతమంది ముభావంగా పలకరిస్తే ఎక్కువమంది నన్ను చూసీ చూడటంతోనే ముఖం చిట్లించుకుని అల్లంత దూరంలోంచి తప్పించుకుని పోతున్నారు. అందుకు నేనేమీ బాధపడలేదు. నాకు తెలుసు వాళ్ల అసహ్య తృణీకార భావానికి నేను తగినవాణ్ణేనని. నేను వాకిట్లో అడుగు పెట్టీ పెట్టకముందే పరిగెత్తుకొచ్చి ప్రేమగా ఆలింగనం చేసుకొంది అమ్మ. ఆమె వెనుకే నాన్న. సజల నయనాలతో నా ఒళ్లంతా ప్రేమగా తడిపేస్తున్నారు చూపులతోనే. నా తల్లిదండ్రుల్ని చూసి నాక్కూ ఏడుపొచ్చేసింది.

"ఏమిటమ్మా నువ్వనేది?" ఆందోళనగా అడిగాను.

"అవున్నాయనా! నువ్వా అమ్మాయికి చేసిన గాయం మానిపోయినా మచ్చ మాత్రం మాయలేదు. బహుశా ఆమె జీవిత తదనంతరంగాని పోదేమో!" బాధగా చెప్పింది అమ్మ.

"అవున్నాన్నా! కాంతి అనుభవిస్తున్న బాధ పగవాడిక్కూడా వద్దు. లోకులు కాకులు కాదురా. రాబందులు, రాబందులు. మనిషి చనిపోయిన తర్వాత పొడుచుకు తింటాయి. కానీ ఈ వూరి జనం బ్రతికుండగానే పొడుచ్చుకుతింటున్నారా మెని. జైల్లో వున్న అయిదు సంవత్సరాలూ నువ్వెంత క్షోభ ననుభవించావో నేనెరగను గాని కాంతి అనుభవిస్తున్న మానసిక క్షోభ పగవాడికక్కూడా వద్దు. జనం దాడికి భయపడి ఇంట్లోంచి బయటికి రావడమే కాదు. తనెంతగా ప్రేమించే చదువుని కూడా వదిలేసింది. ఆమె బయటకొస్తే చాలు. వెకిలిగా వికృతంగా నవ్వే కుర్రకారు ద్వంద్వార్థాల మాటలతో పొడుచుకు తినే నడికారు. కాంతి ఎదురుపడితేనే పాపం అంటుకున్నట్టు చూడరాని దృశ్యాన్ని చూస్తున్నట్లు ముఖం చిట్లించుకొని మూతులు విరిచే ఆడవాళ్లు. వద్దు బాబూ వద్దు." అమ్మ గొంతు దుఃఖంతో పూడుకుపోయింది.

"మరి... మరి... కాంతికి పెళ్లి ఏర్పాట్లు లాంటివేమీ తలపెట్టలేదా అమ్మా?" అలా అడుగుతుంటే ఎందుకో నా గొంతు వణికింది.

'తలపెట్టకపోవడమేమి. చెప్పులరిగేలా తిరుగుతునా'

తీరా ప్రధానం వరకూ వచ్చేసరికి ఎలా తెలుసుకుంటున్నారో ఏమో ఆ అమ్మాయిమీద జరిగిన అత్యాచారం విషయం తెలుసుకొని పత్తా లేకుండా పోతున్నారు.

కాసేపు మా ఇద్దరి మధ్యా నిశ్శబ్దం అలుముకుంది.

"అమ్మా! మీకు అభ్యంతరం లేకపోతే కాంతిని నేను పెళ్లి చేసుకుంటానమ్మా..."

"ఏమిట్రా నువ్వనేది" నిద్రపోతున్నారనుకున్న నాన్న దిగ్గునలేచి అడిగారు.

"అవును నాన్నా కాంతి ఇష్టపడితే మీకూ కాంతి తల్లిదండ్రులకీ ఎటువంటి అభ్యంతరాలూ లేకపోతే ఆ అమ్మాయిని నేను పెళ్లి చేసుకుంటాను. నేను చేసిన తప్పుని నేనే సరిదిద్దుకుంటాను"

అమ్మానాన్న మాట్లాడలేదు.

"ఏం నాన్నా మాట్లాడరేమిటి...?"

"ఏం మాట్లాడం బాబూ! నువ్వా పనిచేస్తే సంతోషించే వాళ్లలో నేనూ అమ్మా ముందుంటాం. తప్పు చెయ్యడం మనిషి బలహీనత. అయితే ఆ తప్పుని సరిదిద్దుకోవడంలోనే మనిషి గొప్పతనం బయటపడుతుంది. నువ్వు చేసిన తప్పుని నువ్వే సరిదిద్దుకుంటానంటే మేమెందుకు అడ్డుచెబుతాం. సంతోషంగా అంగీకరిస్తాం. రేపు వెళ్లి కాంతి అమ్మా నాన్నలతో మాట్లాడతాం. ఇక పడుకో. చాలా రాత్రయింది" అన్నారు నాన్న.

ఒక మంచి నిర్ణయం తీసుకున్నానన్న తృప్తితో ఆ రాత్రి హాయిగా నిద్రపోయాను.

నా ప్రతిపాదన కాంతి ఆమె తల్లిదండ్రులకీ కూడా నచ్చింది. కక్కొచ్చినా కళ్యాణమొచ్చినా ఆగదన్న సామెతని రుజువు చేస్తూ మా పెళ్లి నిర్విఘ్నంగా జరిగిపోయింది.

అది శోభనం రాత్రి.

అందంగా అలంకరించబడిన మా తాతల నాటి పందిరికోళ్ల మంచంమ్మీద పట్టుబట్టల్లో కూర్చొని వున్నాను. నా చూపులు గది ద్వారానికంటుకుపోయి విడివడనంటున్నాయి. పక్క గదిలో కాంతికి శోభన పెళ్లికూతురు ముస్తాబు చేస్తున్నారు. ఉండి ఉండి ముత్తయిదువల జలపాతాల్లాంటి హోరునవ్వులు నా గదిలోకి స్పష్టంగా వినిపిస్తున్నాయి. వాటితోపాటు కాంతినాట పట్టిస్తూ కన్నెపిల్లలాడుతున్న పరాచికాలు కూడా.

అరగంట తరువాత చేతిలో పాల్గ్లాసుతో ముత్తయిదువుల మధ్య నడుచుకుంటూ వచ్చింది కాంతి. ఆమెని లోపలికి నెట్టి తలుపులు మూసి గడియ పెట్టేశారు బయటనుండి.

అక్కడే నిల్చుండిపోయింది కాంతి.

కర్తవ్యం గుర్తొచ్చి మంచం మీంచి లేచి కాంతి దగ్గరికి నడిచాను. తలుపు లోపల గడియ వేసి కాంతిని పొదివి పట్టుకోబోయాను. నా స్పర్శ సోకీ సోకగానే ఒంటిమీద తేళ్లూ జెర్రిలూ పాకుతున్నట్టు ముఖం పెట్టి పురుగుని విదిలించినట్టు విదిలించేసుకుంది కాంతి.

"ఏం కాంతీ. నేనంటే ఇష్టం లేదా?" ఆమె ప్రవర్తనకి విస్తుపోతూ అడిగాను.

"ఇష్టమా?" కాండ్రించినా ముఖమ్మీద ఉమ్మింది కాంతి. ఆమె కళ్లల్లోని ఎర్రజీరలు నామీద అగ్నివర్షం కురిపిస్తుంటే అసహ్యాన్ని జుగుప్సనీ నీ ముఖంలో ప్రదర్శిస్తూ "అసహ్యం. నువ్వంటే నాకు పరమ అసహ్యం. అసలు నీ మగజాతిని చూస్తేనే నా ఒళ్లు కంపరమెత్తిపోతుంది" అంది నెమ్మదిగానే అయినా స్థిరంగా.

దిగ్భ్రాంతిగా చూశానామెవైపు.

"మరలాంటప్పుడు నాతో పెళ్లికెందుకొప్పుకున్నావు?"

"అవును. కావాలనే ఒప్పుకున్నాను. ఎందుకంటే ఈ అయిదు సంవత్సరాలూ నేనెంత క్షోభననుభవించానో అంతకంతా నిన్ను హింసించేందుకు ఒప్పుకున్నాను. దుర్మార్గుడా! నా అందమైన ప్రపంచాన్ని సర్వనాశనం చేశావు కదరా! పువ్వులాంటి నా శరీరాన్ని హృదయాన్ని కూడా కర్కశంగా కాలరాసి పారేశావు గదరా! ఇప్పుడు అంతకంతా నీమీద పగతీర్చుకుంటాను. ఎప్పటికప్పుడు ఏ నూతిలోనో గోతులోనో పడి చావాలనుకునేదాన్ని. ఎందుకు బతికున్నానో తెలుసా? చచ్చి సాధించేదేమీ లేదని తెలిసి. నీమీద ప్రతీకారం తీర్చుకోవడం కోసమే నా జీవితాన్ని నేను నిలబెట్టుకున్నాను. పొడిగించుకున్నాను.

క్షణికోద్రేకంలో ఏ శారీరక సుఖం కోసమైతే నా చిన్ని అందమైన ప్రపంచాన్ని బుగ్గిపాలు చేశావో ఆ శారీరక సుఖం నానుంచి నీకు లభించదు ఇకనుంచి. అలాగని నిన్ను రెండో పెళ్లి చేసుకోనివ్వను. వేశ్యాసంపర్కం పెట్టుకున్నా, తాళికట్టిన ఆలినే కదాని నామీద అత్యాచారం తలపెట్టినా నా మరణానికి నిన్నే కర్తని చేస్తాను. లోకం దృష్టిలో మాత్రమే మనం భార్యాభర్తలం. నిజానికి భార్యాభర్తలకు మధ్యవుండే ఏ సంబంధమూ మనమధ్య వుండదు" కాంతి స్థిరనిశ్చయం నన్ను నిలువునా కూల్చేసింది. చేసిన తప్పుకి ఒకసారి శిక్ష అనుభవించాను. మళ్లీ రెండోసారి శిక్షించడం అమానుషం అని వాదించాను.

ఈరోజు కాకపోతే రేపైనా మారకపోతుందా అని ఆశతో కాలం గడిపాను. కానీ నా ఆశ అడియాసే అయింది. కాంతి మారలేదు.

కాంతిలోని గొప్ప విశేషమేమిటంటే ఈ విషయాన్ని లేదా రహస్యాన్ని ఇటు నా తల్లిదండ్రులకు గానీ అటు తన తల్లిదండ్రులకు గానీ తెలియనీయకుండా ఎంతో జాగ్రత్తగా మెసులుకొనేది. మా దాంపత్య జీవితమ్మీద వారికి కనీసం అనుమానం కూడా కలిగేది కాదంటే— కాంతి ఎంత నేర్పుగా సమయస్ఫూర్తిగా వ్యవహరించేదో అర్థం చేసుకోవచ్చు.

పాపం. మా ముసలాళ్లు మా కడుపునో కాయకాస్తే మురిసిపోవాలని ఎన్ని పూజలూ వ్రతాలూ చేశారో చేయించారో. కానీ విత్తు నాటకుండా మొక్క మొలవదని వారికి తెలీదు. కాంతి తన మాట నిలబెట్టుకుంది. చాలా చక్కగా సాధించింది నన్ను. నామీద చాలా చాలా అందంగా ప్రతీకారం తీర్చుకుంది.

"విచారిస్తూ ఎంతసేపు కూర్చుంటావు రాఘవయ్యా! లే. లే.. సూర్యాస్తమయమయిపోతే శవసంస్కారం చేయరాదు. కాటి ఏర్పాట్లు చూడు" పరశురామయ్య మరోసారి హెచ్చరించడంతో భారంగా లేచినిలబడ్డాను.